క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లిలో ప్రమాదవశాత్తు గుడిసె పూర్తిగా దగ్ధం కావడంతో బాధితకుటుంబానికి శుక్రవారం సర్పంచ్ సుజాత రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. గ్రామంలో 15న రాత్రి గుడిసెతో పాటు సామగ్రి కూడా పూర్తిగా దగ్ధమైన విషయం తెలిసిందే. అయితే నిరుపేద కుటుంబానికి చెందిన వీరికి సర్పంచ్ రూ.5వేలు, 60 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో నాయకులు తేజవర్ధన్, ఉప సర్పంచ్ భాస్కర్, వార్డు సభ్యులు రాము, మన్నెం, అంజనేయులు, మహేష్, రవీందర్, హనుమంతు, శ్రీకాంత్, భరత్‌కుమార్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి



పాన్‌గల్: మండలంలోని రాయినిపల్లి సర్పంచ్ సుఖేందర్‌నాయుడు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. సర్పంచ్ అకాల మరణంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఆయన మరణం పార్టీకి తీరనిలోటు అని మండల బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

అదనపు గదుల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి



పాన్‌గల్: మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాల అదనపు గదుల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రస్తుతం పాఠశాల కొనసాగుతున్న భవనం శిథిలావస్థలో ఉండటంతో అదనపు గదులను గ్రామ సమీపంలో నిర్మిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయా గదుల నిర్మాణం నిబంధనల మేరకు నాణ్యతగా నిర్మిస్తూ త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాధ, బీఆర్ఎస్ నాయకులు బాలస్వామి పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం



వనపర్తి క్రైం: కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్‌కుమార్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని రక్తనిధి కేంద్రంలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈసందర్భంగా రక్తనిధి కేంద్రంలో రక్తనిల్వలు సజావుగా లేని సమయంలో యువకులు స్వచ్ఛందంగా ముందుగా వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ఖాజాకుత్బుద్దీన్ అన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టుపై నిరసన



పెబ్బేరు: ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అక్రమ అరెస్టుపై శుక్రవారం పట్టణ కేంద్రంలోని స్థానిక సుభాష్ చౌరస్తాలో బీఎస్పీ ఆధ్వర్యంలో నాయకులు నిరసన చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ శాంతియుతంగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న క్రమంలో అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని బహుజనులు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ప్రవీణ్‌కుమార్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గణపురం కృష్ణయ్య, ఎంపీటీసీ ఎల్లస్వామి, సుజాత, ఆనంద్, ఆశోక్, ధర్మన్న, రాములు, అరుణ్‌కుమార్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీపై కళాజాతా

పెద్దకొత్తపల్లి: మండలంలోని ఆదిరాలలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా ప్రదర్శన శుక్రవారం నిర్వహించినట్లు బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. ఏపీజీవీబీలో ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పింఛన్ యోజన, సైబర్ మోసాలు, క్రాప్‌లోన్స్, ఎడ్యుకేషన్ లోన్స్, మహిళా సంఘాల రుణాలపై మాటలు, పాటల ద్వార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సాయికుమార్, అకౌంటెంట్ అరవింద్, కళాజాతా బృందం సభ్యులు విజయ్, చిరంజీవి, సాయి పాల్గొన్నారు.



సీసీ రోడ్లు నాణ్యతగా నిర్మించండి

- కొత్త రోడ్లకు అప్పుడే నెర్రెలా..
- కాంట్రాక్టర్ తీరుపై మున్సిపల్ ఈఈ విజయభాస్కర్ ఆగ్రహం



అమరచింత ఎనిమిదో వార్డులో సీసీ రహదారిని కొలుస్తున్న ఈఈ విజయభాస్కర్

అమరచింత: పట్టణంలో రూ.3.5కోట్లతో నిర్మిస్తున్న సీసీ రహదారులను మున్సిపల్ ఈఈ విజయభాస్కర్ శుక్రవారం పరిశీలించారు. కొత్తగా నిర్మించిన సీసీ రహదారులపై అప్పుడే నెర్రెలు కనిపించడం ఏంటని, రహదారులు నిర్మించి నెల రోజులు గడవక ముందే ఇలా ఎందుకు జరిగిందని ఆయన సంబంధిత కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. రహదారులు నిర్మించే సమయాల్లో కాలనీవాసులు పైప్‌లైన్ల పేరుతో కాలయాపన చేయడంతో రహదారి నిర్మాణంలో ఆటంకాలు కలిగాయని కాంట్రాక్టర్ వివరించారు. పట్టణంలోని ఐదు ప్రదేశాల్లో నెర్రెలు గుర్తించామని వాటిని పూర్తి స్థాయిలో సరిచేయాలని ఈఈ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈసందర్భంగా ఐదు, నాలుగు, ఎనిమిది, పదో వార్డుల్లో నిర్మించిన సీసీ రహదారులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఈమేరకు ఆయన సంబంధిత మున్సిపల్ కమిషనర్, ఏఈలతో మాట్లాడుతూ హైదరాబాద్ లాంటి మహా నగరాల్లో వేస్తున్న విధానంలో సీసీ రహదారులు ఇప్పుడు అమరచింతలో నిర్మిస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ ద్వారా ముందస్తుగా ఆయా వార్డు ప్రజలకు అవగాహన కల్పించకపోవడం ద్వారా కుళాయి పైప్‌లని, మురుగుకాలువ పైపులని ప్రజలు రహదారి నిర్మాణాలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఇకపై ఆయా వార్డుల్లో సీసీ రహదారుల నిర్మాణానికి ముందే ఇలాంటి చిన్నచిన్న మరమ్మతు చేసుకోవాలని సూచించారు. నలభై ఏళ్ల వరకు చెక్కు చెదరని విధంగా సీసీ రహదారులను పట్టణాల్లో నిర్మిస్తున్నామని, అన్నింట్లో నాణ్యత పాటిస్తున్నామని తెలిపారు. పట్టణంలో రూ.రెండు లక్షలతో నిర్మిస్తున్న ఇరిగేషన్ కాలువ నిర్మాణ పనులను త్వరితంగా పూర్తి చేయాలన్నారు.

ఆత్మకూర్‌లో రహదారుల పరిశీలన

ఆత్మకూర్ పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రహదారుల నిర్మాణ పనులను ఈఈ విజయభాస్కర్ పరిశీలించారు. నాణ్యతకు భిన్నంగా పనులు జరుగుతున్నాయని సంబంధిత కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అంచనా ప్రకారం సీసీ రహదారులు నిర్మించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రీనివాస్, ఏఈలు ధర్మరాజు, చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి



విద్యార్థినులకు ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న వాకిటి శ్రీధర్

వనపర్తి టౌన్: బాలికలు బాలురతో సమానంగా చదువు, వ్యాపారం, రాజకీయాల్లో ఎదిగేందుకు పోటీ పడాలని మున్సిపల్ వైస్ చైర్మన్, క్లాస్‌మెట్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీధర్ అన్నారు. కొందరు విద్యార్థినులకు పదో తరగతి పూర్తయిన వెంటనే చదువు ఆపేసి వారి ఆశయాలను కల్లోలం చేస్తూ తల్లిదండ్రులు పెళ్లిలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణాధ్యక్షుడు రామకృష్ణ సహకారంతో శుక్రవారం జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో 188మంది పదో తరగతి విద్యార్థినులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల చదువు మధ్యలో ఆగిపోకుండా ఉన్నత చదువులు చదివేందుకు క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో ప్రోత్సహిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సత్య సాగర్, పట్టపాకల మహేష్, కోళ్ల వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తారాబాయి, ఉపాధ్యాయురాలు చెన్నపద్మ, సునీల్ వాల్మీకి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశం

పెబ్బేరు: మండలంలోని బూడిదపాడుకు చెందిన మహేశ్వరి అదృశమైందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగదీష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూడిదపాడుకు చెందిన హోనిమూని దానయ్య కూతురు మహేశ్వరి పెబ్బేరులోని వీరభద్ర డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతుంది. అమ్మాయి రోజు ఇంటి నుంచి ఉదయం 9 గంటలకు కళాశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం 6 గంటలకు వచ్చేది. గురువారం ఎప్పటిలాగే కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయలు దేరింది. మధ్యాహ్నం తన ఫ్రెండ్స్ మీ అమ్మాయి కళాశాలకు రాలేదని సమాచారం ఇవ్వగా తల్లిదండ్రులు చుట్టు పక్కల గ్రామాల బంధువులకు వద్ద వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో తండ్రి దానయ్య ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉమ్రా యాత్రికుడికి ఘన సన్మానం

అమరచింత: పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్తున్న యాత్రికులు ప్రపంచ శాంతికోసం ప్రార్థించాలని మౌలాన అల్తాఫ్ బేగ్, జామీయా మసీద్ కమిటీ అధ్యక్షుడు అయ్యూబ్‌ఖాన్ కోరారు. పట్టణంలోని జామీయా మసీదులో శుక్రవారం పవిత్ర నమాజ్ అనంతరం ఉమ్రా యాత్ర కోసం మక్కా వెళ్తున్న పట్టణానికి చెందిన యాత్రికుడికి శాలువా పూలమాలతో సన్మానించారు. 40 రోజుల పాటు జరిగే యాత్ర అల్లా దయ వల్ల మంచిగా సాగాలని ప్రార్థించారు. మక్కా యాత్రకు వెళ్తున్న మహ్మద్ రఫీకి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రాజావళి దర్గా కమిటీ సభ్యులు అన్సారీ, ఖాజా మైనోద్దీన్, రఫీయొద్దీన్, తౌఫిక్, ఖాసీం ఉన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య ఉండొద్దు

- ప్రతి గ్రామంలో కుక్కల నివారణపై దృష్టి
- ఎంపీపీ ఆవుల శైలజ



మాట్లాడుతున్న ఎంపీపీ ఆవుల శైలజ

పెబ్బేరు: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎంపీపీ ఆవుల శైలజ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ సమావేశానికి ఎంపీపీ ఆవుల శైలజ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు మిగిలిన వాటిని వెంటనే పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. పారిశుద్ధ్యం, విద్యుత్ దీపాలు, కుక్కలను నివారించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా నీరు పోస్తూ వాటిపై నిరంతరం పరివేక్షణ ఉంచాలని, ప్రజల సమస్యలు పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, వైస్ ఎంపీపీ బాల్‌చంద్రారెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ జయసింహ, పంచాయతీరాజ్ ఏఈ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలని వినతి

కోడేరు: మామిడి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 22వేల ఎకరాల మామిడి తోట ఉందని, ఎకరాకు రూ.30వేల చొప్పున పెట్టుబడి పెట్టామని, రాత్రి వీచిన ఈదురు గాలులు, వర్షానికి మామిడి కాయలు నేలరాలాయని అన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని సమక్షంలో జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అన్నారు. కార్యక్రమంలో రైతుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి బుచ్చిరెడ్డి, రమేష్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలకు 'అన్నపూర్ణ' రాగిజావ

పెంట్లవెల్లి: మండలంలోని ప్రతి పాఠశాలకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మధుసూదన్ సహకారంతో ప్రతి పాఠశాలకు బెల్లంతో కూడిన రాగిజావను పంపిణీ చేస్తున్నట్లు ట్రస్ట్ సభ్యుడు అర్జున్‌గౌడ్ తెలియజేశాడు. అందులో భాగంగా శుక్రవారం మండలంలోని గోపులాపురం పాఠశాలలో సర్పంచ్ మేడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు బెల్లం రాగిజావను ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నాగులు, ఉపాధ్యాయులు కృష్ణయ్య, భరత్, సాదిక్, ప్రతాప్‌సింగ్, అలివేల తదితరులు పాల్గొన్నారు.

అనాథ వధువు పెళ్లికి వీజేఆర్ చేయూత



భవానికి నగదును అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

ఆత్మకూర్: పట్టణానికి చెందిన భవాని పెళ్లి ఖర్చుల కోసం వీజేఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.20 వేలు అందించామని ఆసంస్థ అధినేత, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన భవాని తల్లిదండ్రులు చనిపోవడంతో అనాథగా మారింది. ఇటీవలే భవానికి కొత్తకోట మండలం పామాపురం గ్రామానికి చెందిన యువకుడితో వివాహం కుదిరింది. ఆర్థిక పరిస్థితులు లేక పెళ్లి ఖర్చులు కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక నాయకులు వర్కటం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన శుక్రవారం భవాని ఇంటికి వెళ్లి పెళ్లి ఖర్చులకు రూ.20 వేలు అందించారు. రఘు, జావిద్, ఆఫ్రిత్, మదిలేటి, అనిల్, నాని, నవీన్, పవన్, తరుణ్ పాల్గొన్నారు.

ఏవీఎన్ రెడ్డి విజయంపై బీజేపీ సంబరాలు



పెబ్బేరులో బాణా సంచాలు కాల్చుతున్న బీజేపీ నాయకులు

వనపర్తి క్రైం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపుపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తాలో బీజేపీ శ్రేణులు, ఉపాధ్యాయ సంఘం నాయకులు బాణసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈసందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో టీచర్ల సమస్యలపై కేసీఆర్ సర్కార్ వైఫల్యాలకు విసుగు చెందిన ఉపాధ్యాయ, అధ్యాపకులు పార్టీలకు అతీతంగా బీజేపీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డికి మద్దతుగా నిలిచి విజయంలో భాగస్వామ్యులయ్యారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.కృష్ణ, ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరప్రసాద్, శశివర్ధన్, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

కొత్తకోట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఉపాధ్యాయులు గట్టిగానే బుద్ధి చెప్పి సరైన తీర్పు ఇచ్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించడంతో శుక్రవారం బీజేపీ, తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు కొత్తకోట చౌరస్తాలో సంబరాలు జరుకున్నారు. కార్యక్రమంలో భరత్‌భూషణ్, శ్రీకాంత్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు శివనారాయణ, శ్రీనువాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి గెలుపుపై శుక్రవారం నాయకులు బాణాసంచా కాల్చారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు అనుజ్ఞారెడ్డి, గౌని వేమారెడ్డి, గోనెల సహదేవుడు, భగవంత్‌యాదవ్, నాగరాజు, కంచె అంజనేయులు, రాఘవేందర్‌గౌడ్, ప్రకాష్‌శెట్టి, రామకృష్ణ, మేకల బుచ్చన్న, నరసింహనాయుడు పాల్గొన్నారు.

తపస్ ఆధ్వర్యంలో..

ఆత్మకూర్/అమరచింత: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఏవీఎన్ రెడ్డి గెలవడంతో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అమరచింత, ఆత్మకూర్ పట్టణాల్లో విజయోత్సవ సంబురాలను నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో వగ్గు ఉమాశంకర్, నారాయణ, కోట్ల కృష్ణయ్య, ఒగ్గు రమేష్, వెంకటేశ్వర్‌రెడ్డి, విజయ భాస్కర్, శాంతన్న, వెంకటన్న, ఎంఈఓ బాస్కర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



ఖిల్లాఘనపురంలో..

ఖిల్లాఘనపురం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపరిచిన ఏవీఎన్ రెడ్డి గెలవడంతో మండల బీజేపీ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు బాణసంచా కాల్చి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపినాయక్, అంజనేయులు ముదిరాజ్, శివశంకర్, అంజి నాయక్, రాంచందర్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

ఆత్మకూర్: పట్టణానికే కాకుండా ఉమ్మడి జిల్లాకే తాగునీటిని అందిస్తున్న రామన్‌పాడ్ ప్రాజెక్టు వద్ద కాల్వలో పందుల మృత కళేబరాలు ఉండటంతో నీరు కలుషితం అవుతుందని పట్టణ ప్రజలు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి ఎడమ కాల్వ ద్వారా తాగునీరు రామన్‌పాడ్ రిజర్వాయర్‌కు నిత్యం సరఫరా అవుతుంది. దీంతో ఎక్కడి నుంచో కొట్టుకొచ్చిన జంతువుల మృత కళేబరాలు రామన్‌పాడ్ జలాశయం కాల్వ గేట్ల వద్ద నిల్వ ఉండటంతో తాగునీరు కలుషితం అవెతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పప్పు ధాన్యాల సాగుపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని కుడికిల్లలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఆహారభద్రత పథకం 2022-23లో భాగంగా పప్పు ధాన్యాల పంటలపై వ్యవసాయ అధికారులు గ్రామ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ ఎండాకాలంలో సాగు చేసే రైతులకు వంద శాతం రాయితీతో మినుముల విత్తనాలు, (వీబీఎన్-8) రకం, విత్తన శుద్ధికి రైజోబియం మందు అందచేయనున్నారు. మండల పరిధిలోని గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి, ఎంపీటీసీ కోంఢ్ర బిచ్చయ్య, ఏఈఓ రాముడు, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకటేశ్వరావు రైతులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



ముమ్మళ్లపల్లిలో కంటి అద్దాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వామన్‌గౌడ్

కొత్తకోట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని అమడబాకుల, ముమ్మళ్లపల్లి గ్రామాల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు కార్యక్రమంలో సర్పంచ్‌లు బుచ్చన్న, కురుమన్న, ఎంపీటీసీ శేషిరెడ్డి, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొండారెడ్డి, భీంరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, అయ్యన్న, రాజ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

145 మందికి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'కంటి వెలుగు' కార్యక్రమంలో 145 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో ఒకరికి కంటి అద్దాలు పంపిణీ చేశామని, ముగ్గురికి అవసరమైన అద్దాల తయారీకి పంపిచామన్నారు. నలుగురిని ఆపరేషన్ అవసరం ఉన్న వారీగా గుర్తించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని గట్టుకాడిపల్లి సర్పంచ్ దేవేందర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని వైద్యసిబ్బంది, గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. గ్రామంలో శుక్రవారం మొత్తం 126 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యసిబ్బంది నర్సింహులు చెప్పారు. వారిలో 23 మందికి అద్దాలు పంపిణి చేయడం జరిగిందని, 20 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు ఆయన తెలిపారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కమాలోద్దీన్‌పూర్‌లో మొత్తం 142 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా 13 మందికి అద్దాలు అందించగా.. ఇద్దరికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించినట్లు సిబ్బంది చెప్పారు.

ఇళ్లపైనే 11 కేవీ లైన్లు

- దినదిన గండంగా బతుకుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



అమరచింతలోని శ్రీకృష్ణనగర్‌లో ఇళ్లపై నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ లైన్

అమరచింత: పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లోని కాళికాలయం సమీప కాలనీలో ఇళ్లపై నుంచే 11 కేవీ విద్యుత్ లైన్లు వెళ్తుండటంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు బిక్కుబిక్కుమంటూ బతుకీడుస్తున్నారు. శ్రీకృష్ణనగర్‌లో రోజురోజుకూ జనాభా పెరుగుతుండటంతో ఇంటి నిర్మాణాలు పెరిగిపోయాయి. దీంతో తమ స్థలంలో 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుండటంతో నిర్మాణ సమయంలో యజమానులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ ఇళ్లపై నుంచి విద్యుత్ లైన్ మార్చాలని పలుమార్లు మున్సిపల్ పాలక వర్గానికి విన్నవించినా ఇప్పటి వరకు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. చిన్నారులు ఇంటి మిద్దెలపై ఎక్కి అక్కడే ఉన్న విద్యుత్ తీగలను పట్టుకుంటారేమో అన్న భయంతో కంటికి కునుకు లేకుండా బతికే రోజులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వంద కుటుంబాలకు..

కాలనీలోని వంద ఇళ్లకు 11 కేవీ విద్యుత్ లైన్‌తో ముప్పు ఉందని రెండేళ్ల నుంచి మున్సిపల్ పాలకులకు, ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో పట్టణానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది, డీఎంఆర్‌ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్‌రెడ్డికి విషయాన్ని కాలనీవాసులు వినిపించారు. వీటికోసం తన సహాయంగా కొంత మేరకు చెల్లిస్తానని, మిగిలింది మున్సిపల్ నుంచి తీసుకోమని హామీ ఇచ్చారు. విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు చెప్పడంతో మున్సిపల్ నుంచి తీర్మానం ఇస్తే పనులను మొదలు పెట్టి 11 కేవీని అక్కడ నుండి తొలగిస్తామని తెలిపారు. కానీ ఇప్పటికీ మున్సిపల్ నుంచి తీర్మానం పత్రాలు ట్రాన్స్‌కో అధికారులకు అందకపోవడంతో వారు సముఖత చూపడం లేదు.

ప్రమాదం అంచున బతుకుతున్నాం

ఇంటిపై నుంచి 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుంది. తీగలు తెగి పడటం, గాలికి అవి తగిలి నిప్పు రవ్వలు ఎగిసి పడటం నిరంతరం జరుగుతుంది. చిన్నపిల్లలు ఇంటిపైకి ఎక్కడం, వాటిని చేతితో తాకడం చేస్తారన్న భయంతో వారికి కంటికి రెప్పలా కాపాడుకునే పరిస్థితులు దాపరించాయి.

– సూగురు లక్ష్మి, శ్రీకృష్ణనగర్, అమరచింత

తీగలు మార్చండి

మాఇళ్లు కాళికాలయం పక్కన ఉంది. కరెంటు తీగలు ఇంటిపై కప్పుపై నుంచి వెళ్తున్నాయి. ఈదురు గాలులు వచ్చినపుడు తీగలు ఒకదానికొకటి తాకి నిప్పులు వస్తుంటాయి. కరెంటు తీగలను మార్చాలని ఎన్నిసార్లు విన్నవించినా వార్డు కౌన్సిలర్ మాటలను మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– వెంకటేష్, అమరచింత

తీర్మానం ఇస్తే పనులు

మున్సిపాలిటీ నుంచి తీర్మానం పత్రాలు వచ్చిన వెంటనే 11 కేవీ విద్యుత్ లైన్ మార్చేందుకు పనులకు శ్రీకారం చుడుతాం. వారం రోజుల కిందట విషయాన్ని మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లాం. విద్యుత్ తీగలను మార్చాల్సిన అవసరాన్ని వారికి వివరించాం.

– ఎం.రాంచంద్రయ్య, ఏఈ ట్రాన్స్‌కో, అమరచింత